www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 8 మార్చి 2024

రజితకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లి

విభిన్నప్రతిభావంతురాలు రజితకు రాబంధులుగా మారిన సొంతబంధువుల నుండి, సమాజంలోని దుష్టశక్తుల నుండి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, పట్టణ అధ్యక్షులు షాహినా డిమాండు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిటిఎంలో ఉంటున్న మూగ, చెవిటి తనంతో బాధపడుతున్న రజితకు తల్లిదండ్రులు సుమారు ఏడేళ్ల క్రితం మరణించారని తెలిపారు. ఉన్న తోబుట్టువులు అక్క, అన్నదమ్ములు ఆమెను వదిలేసి తమదారి చూసుకున్నారన్నారు. రజిత చుట్టుపక్కల వారి సహాయంతో బతుకు వెళ్ళదీస్తుండగా ఆమె ఉంటున్న ఇంటిని కాజేయాలని ఆమె మేనత్త తదితరులు అక్రమంగా ఆ ఇంటిపై అప్పుచేసి రజితను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టారని చెప్పారు. ఇంట్లోని ఆమె వస్తువులు సామాన్లను బజారులో పారవేసి ఇంటికి తాళంపెట్టి ఆమెను బజారులో నిలబెట్టారన్నారు. అడ్డం వచ్చిన వారిని తరిమి తరిమివేశారు. ఈదురెటనను ఐద్వా తీవ్రంగా ఖండిస్తున్నది. రెవెన్యూ పోలీసుశాఖలు వెంటనే జోక్యం చేసుకోని రజితకు రక్షణ కల్పించి అక్రమంగా స్వాధీనంచేస్కున్న ఆమె ఇంటిని తిరిగి ఇప్పించాలని కోరారు. ఇటీవల మదనపల్లి ప్రాంతంలో మహిళలపై దాడులు ఎక్కువయ్యాయని ప్రభుత్వాధికారులు చొరవ చూపి వీటిని ఆపాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో మహిళలంతా ఉద్యమిస్తారని హెచ్చరించారు.

తొలగని 'కాంట్రాక్ట్' వెతలు

- తప్పులతడకపై తగ్గని జిఎంసి
- సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు
- కళాశాల ఎదుట ఉద్యోగార్థుల ధర్నా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరసన సెగల మధ్య నడుస్తోంది. ప్రభుత్వం రెండు నెలల కిందట జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, మానసిక, కేన్సర్‌కేర్, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని 14 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల నుంచి భర్తీ ప్రక్రియ వరకు అన్నీ తానై చేపట్టింది. రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా సెలెక్షన్ లిస్టు ప్రకటించడంపై ఆందోళన నెలకొంది. రిజర్వేషన్ల గుర్తింపు దగ్గర నుంచి, ఆయా పోస్టులకు అర్హతలు నిర్ధారించడం వరకు విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ మెడిసిన్ ఫిజిసిస్ట్ ఉద్యోగార్థి న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిసిస్ట్, మెడిసిన్ ఫిజిసిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేశారు. విచిత్రమేమిటంటే తను చదవని చదువుకు సంబంధించిన పోస్టుకు సెలెక్షన్ కమిటీ ఎంపిక చేయడం గమనార్హం. మొదటి నుంచి నోటిఫికేషన్‌లో తప్పిదం దొర్లిందంటూ పరిశీలన చేయాలని వాపోతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. సెలెక్షన్ లిస్టులో ఎంపికైన ఉద్యోగానికి సంబంధించిన సర్టిఫికెట్లు లేవని వాపోతున్నారు. కర్నూలు, గుంటూరు వైద్య కళాశాలలు తప్పును సరిచేసి రీనోటిఫికేషన్ ద్వారా భర్తీ చేశాయని వాపోతున్నారు. బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ కేటగిరీలో రిజర్వేషన్ మార్చేశారనే వాదన వినిపిస్తోంది. ఎస్‌సి కేటగిరీ అభ్యర్థికి ఒసి కేటగిరీలో ఎంపిక చేయడం, ఎస్‌సి కేటగిరీని వేకెంట్ పెట్టడమేమిటనే విమర్శ వినిపిస్తోంది. కేన్సర్‌కేర్‌లో ల్యాబ్ విభాగానికి సంబంధించి మెరిట్‌నే మార్చేశారనే వాదన వినిపిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు డిగ్రీని అర్హతగా

నిరసన తెలుపుతున్న ఉద్యోగార్థులు

ప్రకటించారు. పీజీ (డిప్లమా) చేసిన వారిని అర్హులుగా చేయడంలో అర్థం లేదని వాపోతున్నారు. రాష్ట్రంలోని రాజమండ్రి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అర్హులుగా తీసుకున్నారని ఆధారాలతో సహా చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. తమ అభ్యంతరాల పట్ల స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా ఎలా భర్తీ చేస్తారని నిరసన తెలుపుతున్నారు. ఇటువంటి తప్పిదాలను సవరించాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కళాశాల ఎదుట పలువురు ఉద్యోగార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. రివైజ్డ్ ఫైనల్ లిస్టును ప్రకటించిన అనంతరం పోస్టులను భర్తీ చేయాలని, తప్పులను సవరించిన తర్వాత ముందుకెళ్లాలని డిమాండ్ చేయడం విశే షం. ఇప్పటికైనా సర్వజన ఆస్పత్రి కళాశాల యాజమాన్యం సానుకూల వాతావరణంలో సమస్యల్ని పరిష్కరించిన అనంతర రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో నోటిఫికేషన్, రిక్రూట్‌మెంట్ తీరుతెన్నులను సవాల్ చేసి తీరుతామని ప్రకటించడం గమనార్హం. రిక్రూట్‌మెంట్ అవకతవకల వ్యవహారం డిప్యూటీ సిఎం దృష్టికి వెళ్లడంతో సీరియస్‌గా స్పందించినట్లు తెలుస్తోంది.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమగ్రతను, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంలో మీడియా ఎంతో దోహదం చేస్తుంది. రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో మీడియా పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లాలో త్వరలో నిర్వహించబోయే సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్రపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కడప డిసిసి బ్యాంక్ డిఆర్ ఒఎస్‌డి గుర్రప్ప పవర్ పాయింట్ ప్రజెంటషన్ ద్వారా ఎన్నికలలో మీడియా నిర్వహించాల్సిన పాత్రపై పాత్రికేయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో అత్యంత కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికలలో వివిధ విభాగాల లాగానే మీడియా కూడా ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు పారదర్శకంగా స్వేచ్ఛాయిత వాతావరణంలో ఓటు వేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలన్నారు. ఎన్నికలలో అతి సున్నితమైన వాతావరణం ఏర్పడుతుందని వాస్తవ విషయాల కంటే అసత్యమైన విషయాలే త్వరగా వ్యాప్తి చెందుతాయి అన్నారు. ఏదైనా వార్తను ప్రచురించే ముందు వాస్తవాలను సరిచూసుకొని ప్రచురించాలని పాత్రికేయులను కోరారు. ఫేక్ న్యూస్‌లను కాకుండా సత్యమైన, వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారం అయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా ఎన్నికల మీడియా కేంద్రం నుంచి ఐఅండ్ పిఆర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు తెలియజేస్తామన్నారు. ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో, చైతన్య పరచడంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. కడప డిసిసి బ్యాంక్ డిఆర్ ఒఎస్‌డి గుర్రప్ప మాట్లాడుతూ వార్తా కథనాలు ప్రచురించే ముందు వాస్తవాన్ని తెలుసుకొని ప్రచురించాలన్నారు. జిల్లాస్థాయిలో ఎంసిఎంసి కమిటీ కింద మూడు ప్రధాన విధులను కలిగి ఉన్నాయన్నారు. సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనల ముందస్తు ధృవీకరణ, చెల్లింపు వార్తల కేసులపై పర్యవేక్షణ, చర్యలు, ఎన్నికల సమయంలో మీడియా ఉల్లంఘన కేసులను పర్యవేక్షిస్తుందన్నారు. ఏదైనా వ్యక్తి పేరుతో ఏదైనా విమర్శలు లాంటి అంశాలపై మీడియా సంస్థలు పాత్రికేయులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, ఎంసిఎంసి మెంబర్ సెక్రటరీ భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఒ పురుషోత్తం, కేంద్ర ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి ధర్మానాయక్, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పిటిఎంలో తెలుగు తమ్ముళ్ల రచ్చ

- ఎమ్మెల్యే అభ్యర్థి కారుపై మాజీ ఎమ్మెల్యే అనుచరుల దాడి
- కారు అద్దాలు ధ్వంసం
- వాయిదా పడ్డ విజయ సంకల్ప యాత్ర

పోలీసులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి,(ఇన్‌సెట్‌లో) ధ్వసంమైన కారు అద్దాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పిటిఎం మండలంలోని టి.సదుంలో తెలుగుతమ్ముళ్లు రచ్చ చేశారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దాసిరిపల్లి జయచంద్రారెడ్డి కారుపై మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ అనుచరులు దాడి చేశారు. ఈ ఘటనలో జయచంద్రారెడ్డి కారు అద్దాలు ధ్వంసం చేశారు. గురువారం టిడిసి విజయ సంకల్ప యాత్రకు నిమిత్తం జయచంద్రారెడ్డి టి.సదుం చేరుకున్నారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ స్వగ్రామం కావడంతో ఆయన వర్గీయులు కాన్వాయ్‌పై రాళ్ల దాడి చేశారు. సొంత పార్టీలోనే వ్యతిరేకత రావడంతో జయచంద్రారెడ్డి అనుచరులు అసనహనం వ్యక్తం చేశారు. టి.సదుంలో టిడిపి విజయ సంకల్ప యాత్ర తాత్కాలికంగా వాయిదా పడింది. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ అంశాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనకు టికెట్ కేటాయించడంతో కొందరు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. టికెట్ వచ్చినా రాకున్నా పార్టీ గెలుపు కోసం పనిచేసే వారే అసలైన తెలుగుదేశం నాయకులని చురకలంటించారు. అనంతరం జయచంద్రారెడ్డి అనుచరులు మాట్లాడుతూ టిడిపి అభ్యర్థి జయచంద్రారెడ్డి కాన్వాయ్‌పై దాడి చేయడం సమంజసం కాదన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి ఎప్పటికైనా ప్రాధాన్యత లభిస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. దాడి చేసిన వారిపై కేసు పెట్టడం లేదని, ఈ అంశాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

విద్యుత్ వృథాను అరికట్టాలి : ఎస్ఇ

అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్ఇ రమణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యూనిట్ రూ.8.60 పైసలుతో కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నామని, పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగు చర్యలు తీసుకొని విద్యుత్ వృథాను అరికట్టి బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ మండల క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. గురువారం రాజంపేట విద్యుత్ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, రైల్వేకోడూరు మండల క్షేత్రస్థాయి అధికారులతో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయంలో ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయిన వెంటనే వర్క్ ఆర్డర్లు పూర్తి చేయాలని లేని పక్షంలో ఏమాత్రం ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. వర్క్ ఆర్డర్లు నిర్ణీత సమయంలో క్లోజ్ చేయకపోతే సంబంధిత అధికారి వ్యక్తిగత ఖాతా నుండి వర్క్ ఆర్డర్ల పైకాన్ని వసూలు చేస్తామని తెలిపారు. అవసరమైతే వారిపై చట్టపరంగా ఆస్తుల దుర్వినియోగం కింద క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ బకాయిలు అత్యధికంగా పేరుకుపోయి ఉన్నాయని వాటి వసూలుపై దృష్టి సారించి త్వరితగతిన వసూళ్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు కొత్త వ్యవసాయ సర్వీసుల విడుదల మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాజంపేట డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించుటకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకొని, అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని తద్వారా అంతరాయాలు ఏర్పడడమే కాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రజలను చైతన్యవంతులను చేసి విద్యుత్ కంచెలను నిర్మూలించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ముందు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైన్యంలా పని చేస్తేనే ఫలితాలు ఉంటాయని, విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని ఘాటుగా హెచ్చరించారు. సమావేశంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, జెఇలు, అకౌంటు అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం జయలక్ష్మికి జ్ఞాపికను ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలు వ్యవసాయ రంగం నుంచి అంతరిక్ష రంగం వరకు అనేక రంగాల్లో విశేష కృషి చేస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. యుటిఎఫ్, ఐద్వా, సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాజంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్త్రీ భాగస్వామ్యం-అభివృద్ధికి సోపానం అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీల సమాన భాగస్వామ్యంతో సమాజం అభివృద్ధి పథంలో కొనసాగుతుందన్నారు. సరైన అవకాశాలు కల్పిస్తే మహిళలు అద్భుతాలు సృష్టించగలరని తెలిపారు. మహిళా హక్కుల కోసం పోరాడాలన్నారు. చట్టాల గురించి అవగాహన కలిగి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం యుటిఎఫ్ నాయకులు ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మికి జ్ఞాపికను బహూకరించారు. సదస్సుకు ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యాయులు లక్ష్మమ్మ, ఆది లక్ష్మీ, సుమలత, గోవిందమ్మ, సరిత, హైమావతి, భారతి, రాధ, రమణయ్య, హమీద్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విభిన్నప్రతిభావంతులకు పింఛన్ రూ.6 వేలు పెంపుదల కోరుతూ ఈ నెల తొమ్మిదవ తేదీ చేపట్టిన చలో అమరావతి వికలాంగుల మహా గర్జనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, విహెచ్‌పిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఎంఎస్‌సి జిల్లా అధ్యక్షులు మందా శివయ్య ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ భవన్ నుంచి ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ నేతలతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆర్ఐ రాజేష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ కుటుంబం నుండి మొదలుకొని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, శారీరకంగా, మానసికంగా వివక్షకు గురవుతున్న వికలాంగ వర్గాన్ని సకలాంగులతో సమానంగా సభ్య సమాజంలో అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించే విధంగా వికలాంగులు, వృద్ధులు, వితతంతువులకు పింఛన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నుండి పార్లమెంటు వరకు వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, గత ఐదు సంవత్సరాలుగా వివిధ నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన 95,000 మంది పెన్షన్లు పునరుద్ధరించాలని, వికలాంగులైన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్తో రిజర్వేషన్ కల్పించి ప్రభుత్వ అలవెన్స్ రూ.6 వేలు పెంచాలని, కొత్తగా ఏర్పాటైన అన్ని జిల్లాలలో వికలాంగుల సంక్షేమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఉమ్మడి జిల్లాలలో జిల్లాకు ఒక వికలాంగుల సదనాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చేమూరి వెంకటేష్, వడ్డెర పెంచలయ్య, ఆదెయ్య, విహెచ్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సుబ్బారెడ్డి, కో-కన్వీనర్ కృష్ణ, గౌరవ సలహాదారులు చంద్ర, నరసయ్య, రెహమాన్ పాల్గొన్నారు.

కార్పెంటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కార్పెంటర్ల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్పెంటర్ల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రవి హాల్ సమీపంలో నిర్వహించిన కార్పెంటర్ల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషతో కలసి శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. తమకు కాలనీని ఏర్పాటు చేయించాలని కార్పెంటర్లు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు స్పందించిన ఆయన రానున్న రోజుల్లో నూతన హౌసింగ్ కాలనీని ఏర్పాటు చేసి అందులో ప్రత్యేక బ్లాక్‌గా కార్పెంటర్ల కాలనీని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు నియోజక వర్గంలో 20 వేల పక్కా గృహాలు మంజూరు చేశామని, 93 జగనన్న కాలనీలు నిర్మిత మవుచున్నాయని, జిల్లా కేంద్రం ఏర్పాటు కావడంతో పట్టణం దిన దినాభివృద్ధి చెందుతోందని, త్వరలో రూ.100 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు ప్రారంభమవుతాయని, ఇందువల్ల కార్పెంటర్లకు పని అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. గతంలో పట్టణం ఎలా ఉంది, ఇప్పుడు ఎలా అభివృద్ధి చేశామో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. శాంతి, అభివృద్ధే తమ విధానాలని, ప్రజల సంక్షేమం కోసం అనునిత్యం పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కౌన్సిలర్లు ఆసీఫ్ అలీ ఖాన్, ఫయాజ్ అహమ్మద్, కార్పెంటర్ల సంఘ నాయకులు జిలాన్, రామ్మోహన్ పాల్గొన్నారు.

'వైసిపి ప్రభుత్వంలోనే మైనార్టీలకు మేలు'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌ను మరోసారి సిఎంగా గెలిపించుకోవాలని, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్‌బాషా, జిల్లా వైసిపి విభాగం మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 29,30,31 వార్డుల కౌన్సిలర్లు ఆసిఫ్ అలీ ఖాన్, సయ్యద్ సాధాక్ అలీ రాయచోటి పట్టణ వైసిపి నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని కోనేటి గడ్డ వీధితో పాటు పలు ప్రాంతాల్లో ప్రతి గడప గడపకూ వెళ్లి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు వివరించారు. వైసిపి స్టిక్కర్లు అంటిస్తూ ఓట్లు అభ్యర్థించారు. శ్రీకాంత్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని రాయచోటిని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా నవరత్నాలు సంక్షేమం పథకాలను ప్రతి అర్హత కల్గిన లబ్ధిదారులకు చేరవేస్తున్నారని చెప్పారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన పార్క్ తో పాటు నగరవనం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే కాకుండా కడప మార్గంలో శిల్పా రామం పనులు కూడా చక చక జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంజాద్ అలీ ఖాన్, వైఎస్ఆర్ ఖదీర్, అజమాత్ తుల్లాఖాన్, బేపారి జబిఉల్లా ఖాన్, సున్నా, మార్కెట్ స్కూల్ చైర్మన్ గౌస్, జాబీర్, సయ్యద్ సాద్, అమీన్, ఖలీల్, ఫైరోజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మైనార్టీ నాయకులు

మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

'శ్మశానవాటికలకు నోచని దళిత గ్రామాలు'

ప్రజాశక్తి-పీలేరు

దేశానికీ స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్ళైనా శ్మశానవాటికలకు నోచుకోలేక దళిత గ్రామాలు దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మాలమహానాడు రాయలసీమ జిల్లాల సహయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్ ఆధ్వర్యంలో గురువారం పీలేరు మాలమహానాడు మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల గ్రామాల్లో ఎవరైనా మరణిస్తే మృతదేహాలు ఖననం చేసేందుకు జానడు జాగా లేక ఇప్పటికీ వాగుల్లో, వంకల్లో, చెరువుల్లో, ఖనన సంస్కారాలు చేసుకునే దౌర్భాగ్య స్థితి దళిత గ్రామాల్లో నెలకొందన్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులకు, జిల్లా స్థాయి అధికారులకు, మండల స్థాయి అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చుకున్నా ఫలితం శూన్యమని తెలిపారు. ఎస్సీ గ్రామాల జనాభా నిష్పత్తి ఆధారంగా 0.5 సెంట్లు మొదలు ఎకరం వరకు శ్మశానవాటికల కోసం భూమి కేటాయించేందుకు, ప్రతి జిల్లా కలెక్టర్ 45 రోజుల్లోగా శ్మశానవాటికలు లేని గ్రామాలను గుర్తించి ఆ సమస్యను పరిష్కరించాలని 2022 అక్టోబర్ 2న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. ఈ ఆదేశాలు జారీచేసి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని ఏ ఎస్సీ గ్రామంలోనూ అది అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ ఆదేశాలను అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే మండల రెవెన్యూ కార్యాలయాల ముందు నిరసన తెలుపుతామన్నారు. జిల్లా పరిపాలన అధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, మాలమహానాడు పీలేరు మండల ప్రచార కార్యదర్శి డప్పేపల్లి ఆనంద్, తుమ్మల రవి కుమార్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : జెసి

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- రాయచోటి

పేద మహిళల కోసం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ నుంచి వరుసగా నాలుగో ఏడాది వైఎస్ఆర్ చేయూత కింద రాష్ట్రవ్యాప్తంగా 26,98,931 మందికి రూ.5,060.49 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా లోని 80,931మంది అక్కా చెల్లెమ్మలకు రూ.151,75 కోట్లు లబ్ధిని మహిళల ఖాతాలలో జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్‌తోపాటు డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం ద్వారా 45 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఒక్కొక్కరికి రూ. 18,750 చొప్పున ఇస్తున్నారని చెప్పారు. మహిళలు డబ్బును దుర్వినియోగం చేయకుండా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని, ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా అందిస్తున్న ఈ డబ్బుతో మహిళలు కిరాణా షాపు, గేదెలు కొనుగోలు చేసుకుని తద్వారా వచ్చే ఆదాయంతో పిల్లల పోషణ, కుటుంబ పోషణ మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం వైయస్సార్ చేయూత పథకం ద్వారా జిల్లాలోని 80,931 మంది అక్కా చెల్లెమ్మలకు రూ. 151,75,00,000 మెగా చెక్కును ముఖ్య అతిథుల చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
International Women's Day
మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం, పట్టుదలతో ప్రతి అవకాశాన్ని విజయవంతంగా మలచుకోవాలని అన్ని రంగాల్లో మహిళలు మరింత చైతన్యవంతులై ముందుకు సాగాలని కోరుకుంటూ...
మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

ఎన్.జయమ్మ
ప్రధానోపాధ్యాయురాలు,
జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,
కలికిరి మండలం.

మెగా చెక్కును అందజేస్తున్న జడ్‌పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి

ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వైఎస్ఆర్ క్రాంతిపథకం నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని 451 సంఘా లకు 4,427 సభ్యులకు రూ.10.15కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఈ మొత్తాన్ని మహిళల జీవనోపాధికి వినియోగించు కోవాలన్నారు.రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలన్నదే ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశం అన్నారు. జగనన్న తన అక్క చెల్లెమ్మలకు తోడుగా ఉంటూ తన బిడ్డలకు మంచి విద్య వైద్యం అందించడంలో ఆయనకు ఆయనే సాటని అన్నారు. తమ బిడ్డలతో పాటు అందరి పిల్లలను ఆంగ్లభాషలో విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రతి పాఠశాలలోనూ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశె ఎట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి మహిళా జగనన్నకు తోడు ఉంటూ ఓట్లు వేసి గెలిపించి తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, ఎపిఎం ఖాదర్‌వలీ, జిల్లా బిసి సంఘం నాయకుడు మోడం నాగభూషణం, నాయకులు విఆర్.వెంకట్రామిరెడ్డి, లాయర్ పవన్ కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపీనాథ్‌రెడ్డి నాగిరెడ్డి, ఎంపిటిసిలు సబ్బరామరాజు, నాగులయ్య, సొసైటీ అధ్యక్షుడు రామానుజన్ రెడ్డి, వైసిపి నాయకులు సీతంపేట వెంకట్‌రాజు, సుబ్బరామరాజు, శ్రీరాముల్ రెడ్డి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పూలకొండలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-కలికిరి

పలువురి దాతల సహాయంతో మండలంలోని గుట్టపాలెం పంచాయతీ కె.బర్నేపల్లి పూలకొండలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నట్లు ఆలయ కార్యకర్తలు ఆదినా రాయణ, కరుణాకర, మునీంద్రలు పేర్కొన్నారు. శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని వాల్మీకిపురం మండలం పెద్దవంకపల్లికి చెందిన కమలమ్మ కుమారులు నరసింహారెడ్డి, కోడలు శ్రీదేవి, రాణెమ్మలు మూడు లక్షలతో భ్రమ రాంబ కల్యాణ మండపం, స్టేజి, పెద్ద కమ్మపల్లికి చెందిన ప్రసాద్‌నాయుడు 50వేల రూపాయలతో గుడికి సంబంధించిన కట్టడాలు, జయప్ప నాయుడు దర్శనానికి క్యూలైన్ ఏర్పాట్లు, కలికిరికి చెందిన నజీర్ మేస్త్రి ఇసుక, కంకర, వైస్ ఎంపిపి శ్రీకాంత్ 23 సిమెంటు బస్తాలు అందించినట్లు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-వీరబల్లి

విద్యుత్ సబ్ స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న ఎంపిపి

మండల పరిధిలోని తాట గుంటపల్లి పంచాయతీ శికారుపాలెం దగ్గర ఎస్ఎల్ఆర్ ప్రయివేట్ లిమిటెడ్ వారికి 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రంకు రూ.3.కోట్ల 30 లక్షలతో నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిం దని విద్యుత్ శాఖ ఎఇ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈ నిర్మాణానికి గురువారం ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ గోపి నాథ్‌రెడ్డి, ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, కాంట్రాక్టర్ ఆరిఫ్‌లు భూమి పూజ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి 1.07 ఎకరా స్థలం ఇచ్చినట్లు తెలిపారు. ఎంపిపి రాజేంద నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ విద్యుత్ సబ్ స్టేషన్ కావాలని తన దృష్టికి తీసుకు వచ్చారు.మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్ నాగార్జునరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి సహకారంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు అయ్యిందని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇ రమేష్‌బాబు, ఎస్ఎల్ఆర్ ప్రాజెక్టు మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, కాంట్రాక్టర్ హరిఫ్, కిషోర్‌రెడ్డి, వెంకట్‌రాజు, రామచంద్రారెడ్డి, లాయర్, సుబ్బరామరాజు, పలువురు వైసిపి నాయ కులు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరబల్లి

పశువులను పరీక్షిస్తున్న డాక్టర్ గుణశేఖర్ పిళ్లై

మండలంలోని సోమవరం పంచా యతీ పుత్తావాండ్లపల్లిలో పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం గురువారం నిర్వహించారు. పశు వైద్యులు డాక్టర్ గుణశేఖర్ పిళ్లై ఆధ్వర్యంలో గ్రామంలో 31 పశువులకు గర్భకోశ చికిత్స, 25 పశువులకు సాధారణ చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ పశువులకు బలవర్ధకమైన పోషక పదార్థాలు ఇవ్వాలని విశ్రాంత పశు సంవర్ధకశాఖ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విఆర్ విద్యాసంస్థ అధినేత వెంకట్రాంరెడ్డి, డిఎహెచ్ఒ డాక్టర్ గుణశేఖర్, డిఎల్‌డిఎ డిప్యూటీ డైరెక్టర్ రమేష్, రాయచోటి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, పశు వైద్యులు డాక్టర్ జగన్నాథరెడ్డి, డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ నాగరాజు, టెక్నికల్ విఐఎస్ రవికుమార్, జెవిఒ రాజేంద్ర, విఎల్ఒ జయప్రకాష్, ఎహెచ్ డబ్ల్యూ సిబ్బంది రవి, సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వేలంపాట ఆదాయం రూ.12.06 లక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బి.కొత్తకోట : మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

వేలంపాట ద్వారా నిమ్మనపల్లి పంచాయతీకి రూ.12.06 లక్షలు ఆదాయం సమకూరినట్లు డిఎల్‌పిఒ నాగరాజ, ఇఒపిఆర్‌డి చలపతిరావు తెలిపారు. గురువారం స్థానిక వారపు సంత ఆవరణంలో సర్పంచ్ పాపు లమ్మ మల్లప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటను వారు నిర్వహించారు. వేలం పాటదారులు వేలంలో పాల్గొనగా, వారపు సంతను 7లక్షలకు సోమశేఖర్‌రెడ్డి దక్కిం చుకున్నారు. 10 పంచాయతీ రూములకు గాను 9 రూములకు వేలంపాట నిర్వహించగా ఏడాదికి రూ.5,06 ,400లు ఆదాయం సమ కూరిందని అన్నారు. వారపు సంత ఏడు లక్షలు, పంచాయితీ షాపు రూముల బాడుగ ఏడాదికి రూ.5,06,400లు, 2024-20 25 ఆర్థిక సంవత్స రానికి రూ.12.06లక్షలు ఆదాయం సమ కూర్చినట్లు తెలిపారు. బస్టాండ్ గేటుకు వేలంపాటను నిర్వహించాల్సి ఉండగా వేలం పాటదారులు బస్టాండ్ గేటుకు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా పడిందని చెప్పారు. బస్టాండ్ లోని దుకాణదారులు గేటు పాడుకున్న వేలంపాటదారులకు గేటు రుసుం చెల్లించడం లేదని అందుకు అధికారులు హామీ ఇస్తే వేలంపాటలో వేలంపాటదారులు పాల్గొంటామని తెలిపారు. అధికారులు చర్చించి అటువంటి దుకాణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, సచివాలయ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, రాజేష్, వేలంపాటదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** వివిధ అంశాలకు నిర్వహించిన వేలంపాటల ద్వారా బి.కొత్తకోట నగర పంచాయతీకి ఆదాయం సమకూరినట్లు కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. నిర్వహించిన వేలం పాటల్లో దినసరి, వారపు కూరగాయల మార్కెట్ జిఎస్‌టితో కలిపి రూ.1,64,610లకు వారపు సంతను జిఎస్‌టితో కలిపి రూ.17,16, 900లకు, ప్రయివేట్ బస్టాండ్ జిఎస్‌టితో కలిపి రూ.3,15,650లకు హెచ్చుపాటదారులు దక్కించుకున్నట్లు తెలిపారు. ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి నగర పంచా యతీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

స్త్రీ లేనిదే మానవ మనుగడలేదు : జడ్జి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు: సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అంజనీ ప్రియదర్శిని

స్త్రీ లేనిదే మానవ మనుగడ లేదని జూనియర్ సివిల్‌జడ్జి అంజనీ ప్రియదర్శని పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ స్త్రీ కుటుంబం పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ తన భర్త, పిల్లలను సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని అన్నారు. స్త్రీ లేనిదే మానవ మనుగడ లేదని అలాంటి స్త్రీకి నేటి సమాజంలో రక్షణ కరువైందని కావున స్త్రీ తనకు తాను కాపాడుకోవడానికి సమాజంలో ఉన్నత వ్యక్తిగా ఎదగడానికి చిన్నతనం నుంచి చదువులు నిర్లక్ష్యం చేయకుండా చదువుతోపాటు ఆటల పోటీలలో ముందుండి తన జీవితాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. వివాహ బంధంలోకి వెళ్లి పిల్లలను ఉన్నత విద్యావంతులుగా చేయాలని తెలిపారు. మహిళలకు సంబంధించినటువంటి చట్టాలు ప్రస్తుతం సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడానికి చట్టాలపై అంగన్వాడీ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగు తున్నట్లు మీకు సమాచారం అందినట్లయితే బాల్యవివాహాలను వలన కలిగే నష్టాలను తెలియజేసి అమ్మాయి తల్లిదండ్రులకు అవగాహన కలిగించి 21 సంవత్సరముల తర్వాతనే పెళ్లి చేయాలని ఆన్నారు. సిడిపిఒ టిపి.సౌభాగ్యమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు నిబద్ధతతో సమాజానికి ఉపయోగపడేలా తమ వంతు సహాయాన్ని అందించి గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతూ నిబద్ధతతో కూడిన సమాజసేవ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సిఐ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిర్మల, సుబ్బలక్ష్మి, యశోద, రత్నమ్మ, గుణవతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వెంకటరామరాజు, సీనియర్ న్యాయవాదులు ఎం.శంకరయ్య, సుదర్శన్ రెడ్డి, ఎస్ మూకాంబిక, కృష్ణ పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మహిళలు అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ భాగ్యమ్మ, తహశీల్దార్ పుణ్యవతిలు ఆకాం క్షించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నందు సిడిపిఒ భాగ్యమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ పుణ్యవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఒడిదొడుకులను ఎదుర్కొని భవిష్యత్తులోనూ మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు ఉండేలా ఎదగాలని, లింగ వివక్ష, బాల్యవివాహాలు, గృహహింస అత్యాచారాలు, డౌరీ డెత్ వంటి దురాగతాలను మనోధైర్యంతో ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు జి.హిజాద్ ప్యారీ, జి.జయరాణి, జి.గౌరీదేవి, బి.మంజులకుమారి, బి.భవాని, సిడి నాగరత్న, ఐసిడిఎస్ సిబ్బంది జి.కవిత, అజయ్, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సభా భవనంలో ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలో కూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చాలా మంచి పని చేశారని భారత రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి, అంగన్వాడీ, సూపర్వైజర్‌లు, నిర్మల, జయలక్ష్మి, మణెమ్మ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, మండలాధ్యక్షురాలు వనజా కుమారి, ఏవో ఖాన్ , తహసిల్దార్ వెంకటనారాయణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నవీన్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనే లక్ష్యం :'గడికోట'

బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

ప్రయాణీకుల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రామాపురంలో రూ.18వేలు ఎంపీ మిథున్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులుతో నిర్మించిన ఆర్‌టిసి బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన రామాపురంలో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్రయాణీకులు, ప్రజలు కోరిక మేరకు బస్‌షెల్టర్‌ను నిర్మించినట్లు తెలిపారు. బస్‌షెల్టర్‌లో మౌలిక వసతులుతో పాటు మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలోమాజీ ఎంపిపి గడికోట జనార్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, ఆర్‌టిసి డిఎం ధనంజయ, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైస్ ఎంపిపిలు రవిశంకర్ రెడ్డి, బాబు, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

నూతన సచివాలయం ప్రారంభం

చిన్నమండెం : చిన్నమండ మండలం దేవగుడిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపం గ్రామ సచివాలయాలని శాశ్వత కార్యాలయ భవనాల నిర్మాణంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పారదర్శకంగా గ్రామస్థాయిలోనే ప్రజలకు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయ భవనానికి స్థలదాత రామసుబ్బారెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. దేవగుడిపల్లె గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానిక 1.50 కోట్ల రూపాయలు నిధులతో పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ తిమ్మారెడ్డి, టీచర్ భాస్కర్ రెడ్డి టీచర్ రెడ్డన్న, సింగల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, వైసిపి నాయకులు బాబురెడ్డి, సర్పంచ్ అమ్మ తమ్మ, ఎంపిటిసి తులసమ్మ, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

పుల్లగూర గండి ఇసుక రీచ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-వీరబల్లి

ఇసుక రీచ్ పెట్టొద్దని ఎస్ఐతో మాట్లాడుతున్న స్థానికులు

మండలంలోని డి.రాచపల్లి, వీరబల్లి పంచాయతీ సంబంధించిన పుల్లగూర గండి సమీపంలో ఉన్న మాండవ్య నదిలో ఏర్పాటు చేయాలనుకున్న ఇసుక రీచ్‌ను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు.పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు ఏర్పాటు చేయాలన్న ఇసుక రీచ్‌ను కళ్ళేవాండ్లపల్లి, బలిజపల్లి, గుట్టకిందపల్లి, రాచపల్లి, బొంగా వండ్లపల్లి, పూలు చెన్నారెడ్డి గారిపల్లి, వీరబల్లి, వంగిమళ్ళ, గ్రామస్తులుకొందరు అక్కడికి చేరుకుని ఇసుక రీచ్ వద్దని అడ్డుకున్నారు. ఇసుక అక్రమంగా తవ్వేస్తే వర్షాలు పడని సమయంలో తీవ్ర ఇబ్బందులు తప్పవని, తాగునీటి కష్టాలు వస్తాయని వీరబల్లి ఎస్ఐ చంద్రమోహన్ కు విన్నవించుకున్నారు. గ్రామస్తులు వెళ్లి కలెక్టర్‌ను సంప్రదించాలని, ఇలా చేయడం పద్ధతి కాదని ఎస్ఐ చంద్ర మోహన్ చెప్పడంతో స్థానికులు అందుకు అంగీకరించారని అన్నారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ తాము వెళ్లి కలెక్టర్‌ను కలిసి. వచ్చేవరకు ఇక్కడి ఇసుక తరలించవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రరెడ్డి, టిడిపి బిసి సెల్ అధ్యక్షులు తుమ్మల రమేష్, బాబురెడ్డి, జయచంద్రరెడ్డి, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం :' కొరముట్ల'

పుల్లంపేట: లబ్ధిదారులకు ఇంటిపట్టాను అందిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-పుల్లంపేట

పేదల సొంతింటికల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని నిరుపేద కుటుంబాలకు మంజూరైన ఇంటి పట్టాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇళ్ల స్థలాలను ఇవ్వటమే కాకుండా ఆ ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సాధ్యమని అన్నారు. ఇలాంటి ముఖ్య మంత్రి ఉంటే పేదరికం, నిరుద్యోగ సమస్యలు తగ్గుతాయని మహిళలు ఆర్థికంగా బలపడతారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, కుమార్ రెడ్డి, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, తహశీల్దార్‌వెంకటనారాయణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, ఇఒఆర్‌డి ప్రకాశం, సర్పంచ్ చంగయ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని 341మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథ్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల ఇంటి పట్టాలు పేదలకు పంపిణీ చేయడం చారిత్రాత్మకమని ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు, ఆ స్థలాలుపై సర్వహక్కులును ప్రభుత్వం కల్పించిందని అన్నారు. పేదల సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తున్న జగన్‌ను మరోసారి సిఎంను చేసేందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు రెవెన్యూ , సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన.. శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం

ప్రజాశక్తి-కలకడ

మహాశివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో పది రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలనుఅన్ని ఏర్పాట్లను పూర్తి చేసినుట్ల ఆలయధర్మకర్త అఖిలేష్ పేర్కొన్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని నిర్వహించే జాతరను హిందూ, ముస్లిం ఐక్యత తో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. పది రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాఆలను తిలకించడానికి కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుంచి రావడం జరుగుతుందని అన్నారు. మండల కేంద్రమైన కలకడ సిద్దేశ్వరస్వామి ఆలయానికి అనుసంధానంగా ఝరి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారని చెప్పారు. మహాశివరాత్రి మరుసటి రోజున ఝరి మహోత్సవం నిర్వహిస్తూ శివ పార్వతులు సతీసమేతంగా ఝరికి వెళ్ళి సత్య వతిని దర్శించి రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉత్సవంలో అంగరంగ, వైభవంగా నాణెములు, దేవరెద్దులు, కోలాటాలు, చెక్కభజనల మధ్య జరుపుతారని తెలిపారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని అన్నారు. చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మజ్జిగ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ శ్రీనివాసులు, కలకడ రామకృష్ణారెడ్డి తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

గాలివీడు : సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం వెలిగల్లులో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైన ఆధార్‌కార్డు నంబర్, ఒటిపి నెంబర్ చెప్పమని అడిగి చెప్పవద్దని అలాటింటి వారిపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు, పేకాట ఆడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు సమాచారం అందించాలని తెలిపారు.అనుమానాస్పద స్థితిలో ఉన్న కొన్ని గృహాలను అ పరిసరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ అంజిరెడ్డి, రైటర్ అల్తాఫ్, బిసిలు ఇరగంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సిఐ బాబు

క్రీడలతో మానసిక వికాసం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని సిఐ బాబు పేర్కొన్నారు. గురువారం గాంధీనగర్ వద్ద గల విజ్‌డమ్ సిబిఎస్ఇ హైస్కూల్‌లో వార్షిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ బాబు మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు ఆటల్లో కూడా ప్రోత్సహించడం చాలా అవసరమని అన్నారు. ప్రాఠశాల డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ విజ్‌డమ్ స్కూల్‌లో చదువుకి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందో శారీరక వ్యాయామానికి ఉపయోగపడే క్రీడలకు అంతే ప్రాముఖ్యత ఉంటుందని, క్రీడలు విద్యార్థులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని, సృజనాత్మకతను మెరుగు పరుస్తాయని అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ మదన్మోహన్. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్ అహ్మద్

ఎన్నికలకు సమాయత్తం కండి : నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి ప్రభుత్వ పరిపాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచిని, అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించి ఎన్నికలకు సమాయత్తం మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లిలో వైసిపి మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గృహ సారథులతో పంచాయతీల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, వారు వాటితో సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి దాదాపు ఐదు లక్షలకు పైగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని అందించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో సచివాలయ పరిపాలనను ప్రవేశపెట్టిన ఘనత మన జగనన్నకే దక్కుతుందని వివరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో కలిసి మెలిసి వైసిపి విజయానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల కన్వీనర్ సదాశివరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఆర్ఐ రమణారెడ్డి, సాయి ప్రతాపరెడ్డి, కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి, రామమోహన్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి


బాధితులకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

మండలం పరిధి లోని గాదెల పంచాయితీ కొత్తపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపాకు సుబ్ర మణ్యం కుమార్తెకు లింఫోబ్లాస్టిక్ లుకేమియా కేన్సర్ వ్యాధి బారిన పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. విష యం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆసరాలేని అభాగ్యులను ఆదుకునేందుకు తమ కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సేవా కార్యక్రమాలను విస్తృత పరిచామని అన్నారు. కార్యక్రమంలో పోలి హరి, మిణుకు హరి, రెడ్డిపాకు సుబ్రమణ్యం, పోలి పార్వతమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

హత్య కేసులో ములకలచెరువు పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. గురువారం శిక్షణ డిఎస్‌పిప్రశాంత్, సిఐ తమ్మిశెట్టి మధులు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ములకలచెరువు మండలం, కదిరినాయనికోట గ్రామం, గాలేటివారిపల్లికి చెందిన పూజారి వెంకటప్పకు ముగ్గురు కుమారులు వెంకటరమణ, కృష్ణప్ప, శ్రీరాములు వీరికి తండ్రి వెంకటప్ప వ్యవసాయ భూమిని సమంగా పంచాడని అన్నారు. మూడవవాడైన శ్రీరాములు తనకు వచ్చిన వాటా భూమిని తన అన్న కృష్ణప్పకు విక్రయించాడని, గత కొద్ది కాలంగా భూములకు మంచి గిరాకీ రావడంతో భూమిలో తనకు వాటా ఇవ్వాలని అన్న కృష్ణపతో శ్రీరాములు గొడవపడేవాడని తెలిపారు. ఉన్న భూమిలో తనకు వాటా రావాలని మదనపల్లి సివిల్ కోర్టులో శ్రీరాములు తన అన్న కృష్ణప్పపై కేసు దావా కూడా వేశాడని చెప్పారు. కేసు పెండింగ్‌లో ఉందన్నారు. కృష్ణప్పకు చెందిన భూమిలో ఇటీవల ప్రభుత్వ వారు భూసర్వే నిర్వహించి సర్వే రాళ్లను నాటారని అన్నారు. ఈనెల 2న కృష్ణప్పకు చెందిన భూమిలో ఉన్న సర్వే రాళ్లను శ్రీరాములు, భార్య శాంతమ్మ, కుమారుడు సురేష్‌లు తొలగి స్తుండగా, కృష్ణప్ప అతని కుమారుడు హనుమంతు, కోడలు గీతాంజలిలు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి సర్వే రావాలని ఎందుకు తొలగించారని నిలదీసినట్లు చెప్పారు. తమకు భూమిలో హక్కు ఉందంటూ శ్రీరాములు, అతని భార్య శాంతమ్మ, కుమారుడు సురేష్‌లు కృష్ణప్పపై గొడవకు దిగి దాడి చేశారు. కృష్ణప్ప తలపై కట్టెతో బలంగా కొట్టడంతో రక్త గాయాల య్యాయి. రక్త గాయాలైన కృష్ణప్పను కుమారుడు హనుమంతు, మొలకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారని తెలిపారు. పరిస్థితి విషమించటంతో తిరుపతి ఆసుపత్రికి తరలించారని అన్నారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి కృష్ణప్ప మృతి చెందాడని చెప్పారు. జరిగిన ఘర్షణ పై మృతుడి కృష్ణప్ప కోడలు గీతాంజలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్ఐ తిప్పే స్వామి కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. కేసును మొలకలచెరువు ఇన్‌ఛార్జి శిక్షణ డిఎస్‌పి ప్రశాంత్ కేసును దర్యాప్తు చేస్తుండగా, పరారీలో ఉన్న శ్రీరాములు, శాంతమ్మ, సురేష్‌లు బుధవారం ములకలచెరువు మండల కేంద్రంలోని తంబళ్ల పల్లి క్రాస్ రోడ్డు వద్ద నిందితులు ఉన్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి శ్రీరాములు, అతని భార్య శాంతమ్మ, కుమారుడు సురేష్‌లను కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న శిక్షణ డిఎస్‌పి ప్రశాంత్